గళం విప్పిన ఎమ్మెల్యే



చెరువులను ఆధునికీకరించాలి

అసెంబ్లీలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

తాండూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ సమీపంలో ఉన్న శివసాగర్, తాండూరు పట్టణంలోని గొల్ల చెరువులను ఆధునికీకరించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి కోరారు. గురువారం శాసన సభలో ఆయన తాండూరు సమస్యలపై గళమెత్తారు. శివసాగర్, గొల్ల చెరువును ప్రక్షాళన చేయాలన్నారు. హైదరాబాద్‌లో పలు చెరువులను ప్రభుత్వం సుందరీకరిస్తుందని, గ్రామీణ ప్రాంతమైన వికారాబాద్ జిల్లాలోని శివసాగర్, గొల్ల చెరువులను ఆధునికరిస్తే ఇక్కడి ప్రజలకు సేద తీరేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తాండూరులో మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేయాలని కోరారు. మహిళా సంఘాలకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అప్పగించాలన్నారు. మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని గుర్తు చేశారు.

వికారాబాద్‌ను ఆదర్శంగా

తీర్చిదిద్దుతా..

రోడ్ల నిర్మాణంలో నియోజకవర్గానికి ప్రాధాన్యం

ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

7



శిథిలావస్థలో ఘట్‌కేసర్‌లోని గురుకుల్ భవనాలు

గురుకుల్‌కు దిక్కెవరు?

నాడు ఘనకీర్తి.. నేడు అధోగతి

మహోన్నత ఆశయంతో నెలకొల్పిన ఘట్‌కేసర్ గురుకుల్ విద్యా సంస్థ పరిస్థితి దయనీయంగా మారింది. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి వేలాది మందికి విద్యనందించిన విద్యాలయం నేడు నిరాదరణకు గురైంది. విద్యతోపాటు నైపుణ్యాలనూ అందించిన సంస్థ నేడు కళావిహీనంగా మారింది. నిత్యం యజ్ఞయాగాదులతో విరాజిల్లిన విద్యాలయం నేడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. వేల కోట్ల ఆస్తులున్నా నిర్వహణకు చిల్లిగవ్వ లేక దినదినగండంగా మారింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు లేక వెలవెలబోతోంది.

- నాడు వందల మంది విద్యార్థులు.. నేడు 20లోపే
- వందల కోట్ల ఆస్తులున్నా అధ్వాన పరిస్థితి
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా భవనాలు
- మూతపడే దిశలో గురుకుల్ విద్యా సంస్థ
- అభివృద్ధిని పట్టించుకోని ప్రభుత్వాలు
- ఆందోళనలో ఘట్‌కేసర్ గురుకుల్ పూర్వ విద్యార్థులు, స్థానికులు

ఘట్‌కేసర్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఘన చరిత్ర గల గురుకుల్ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. ఘట్‌కేసర్‌లో బన్సీలాల్ వ్యాస్ నెలకొల్పిన విద్యాలయం పతనం అంచుల్లోకి చేరింది. ఘట్‌కేసర్‌లో 26ఎకరాల సువిశాల ప్రాంగణంలో అందమైన భవంతులు, వ్యవసాయబావులు, వందల



గురుకుల్ ముఖద్వారం

కొలది పశుసంపద, నిత్యహోమాలతో విరాజిల్లుతూ ఉండేది. విద్యార్థులకు అవసరమైన బియ్యం, కూరగాయలు, పాలు, పెరుగు, నెయ్యి, చివరకు పండ్లు సైతం ఇక్కడే లభించే విధంగా విద్యాలయాన్ని తీర్చిదిద్దారు. ఇక్కడ హాస్టల్‌లో విద్యర్థులకు స్వచ్ఛమైన ఆహారం అందించేవారు. చదువులోనూ కఠిన పద్ధతులు అవలంభించి విద్యాబోధన చేసేవారు. దక్షిణ భారతదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వారు ఇక్కడ విద్యనభ్యసించేవారు. దీనికి ప్రధాన కారణం ఇక్కడ హిందీ భాషలో విద్యాబోధన ఉండేది. నాడు పాఠశాలలోనే 35మంది ఉపాధ్యాయులు, వెయ్యికి పైగా విద్యార్థులు

మిగతా 8వ పేజీలో...

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



గురుకుల్‌కు చెందిన విలువైన భూ ఆక్రమణలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ఈ ప్రభుత్వం స్పందించి కేజీ టూ పీజీ విద్యాలయం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి. ఈ సంస్థను ఎండోమెంట్ నుంచి తప్పించి గురుకుల్ అభివృద్ధికి స్వయం ప్రతిపత్తి గల కమిటీని ఏర్పాటు చేయాలి.

- పిట్టల శ్రీశైలం, గురుకుల్ పూర్వ విద్యార్థి

ధాన్యం సేకరణకు కేంద్రాల ఏర్పాటు

» మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్లు

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): యాసంగికి సంబంధించి ఐకేపీ ఆధ్వర్యంలో జిల్లాలో సరిపడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. గురువారం పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్, సెర్ప్ సీఈఓ దివ్యతో కలిసి నిర్వహించిన కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, దివ్యాంగులకు యూడీఐడీ కార్డుల జారీ ప్రక్రియ, వృద్ధాప్య ఫించన్లు, మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ సాంబశివరావు, అధికారులు విజయకుమారి, సుగుణాబాయి, చంద్రకళ, శివప్రసాద్, పాల్గొన్నారు.

వికారాబాద్‌లో 34 కొనుగోలు కేంద్రాలు

వికారాబాద్: ఐకేపీ ఆధ్వర్యంలో ప్రస్తుతం 34 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడారు. ధాన్యం సేకరణకు సరిపోను గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచామని, దివ్యాంగులను నిర్ధారించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని, యూడీఐడీ కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, డీఆర్డీవో శ్రీనివాస్, సరోజ, మోహన్ బాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



శేషవాహనంపై వేంకటేశ్వరుడు

కొడంగల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పేదల తిరుపతి కొడంగల్ మహాలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ మాడ వీధుల్లో స్వామి వారు చిన్న శేష వాహనంపై మహావిష్ణు అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు ప్రత్యేక పూజలు చేశారు.

చాన్స్ దక్కేనా?

మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి జిల్లాకు అవకాశాలు తక్కువే

» రేసులో మల్‌రెడ్డి, టీఆర్ఆర్, మహేందర్‌రెడ్డి..

» చీఫ్ విప్ ఇస్తామని ఒకరికి హామీ!



రంగారెడ్డి, ఎమ్మెల్యే



రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే



మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ

పరిగి/రంగారెడ్డి అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): త్వరలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరగనున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు చెందిన కొందరు సీనియర్లు మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి దాదాపు 16నెలలైనా ఇప్పటి వరకు పూర్తిస్థాయి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయని విషయం తెలిసిందే. మంత్రివర్గంలో మరో ఆరు బెర్తులు ఇంకా ఖాళీగా ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరికి మంత్రివర్గంలో చోటు దక్కగా.. కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం మూడు జిల్లాల్లో ఒక్కరికీ మంత్రి పదవి దక్కలేదు. త్వరలో మంత్రివర్గ విస్తరణ చేపట్టనుండడంతో ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్లు మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. క్యాబినెట్ విస్తరణలో తమకు అవకాశం కల్పించాలని అధిష్ఠాన పెద్దల చుట్టూ తిరుగుతున్నారు. అయితే ఉమ్మడి జిల్లా నుంచి కొందరు సీనియర్ ఎమ్మెల్యేలు మంత్రి పదవి రేస్‌లో ఉన్నా.. ఉమ్మడి జిల్లాకు ఆ పదవి దక్కే అవకాశాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో నలుగురికి మాత్రమే అవకాశాలు కల్పించనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఒక వేళ ఇప్పుడు ఆరు మంత్రి పదవులను

మిగతా 7వ పేజీలో...

నాసిరకం ఆహార పదార్థాలు

విక్రయిస్తే చర్యలు

» దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణి



హోటల్‌లో తనిఖీ చేస్తున్న నాగమణి

కీసర రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నాసి రకం ఆహార పదార్థలు విక్రయించిన వారిపై చర్యలు తీసుకుంటామని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణి హెచ్చరించారు. గురువారం మున్సిపల్ పరిధిలోని పలు హోటళ్లలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధానంగా సంతోష్ దాబా, బిర్యాని కబాబ్ హోటళ్లలో తిను బండారాలు తయారు చేసే పిండిలో పరుగులుండటాన్ని గమనించారు. వంట పాత్రలు, వంట గది శుభ్రంగా లేకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంతోష్ దాబాకు రూ.4వేలు, కబాబ్ సెంటర్‌కు రూ.వెయ్యి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాసి రకం వస్తువులు వినియోగించినా, కల్తీకి పాల్పడినా, పరిసరాలను అపరిశుభ్రంగా ఉంచినా తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఇంగ్లిష్‌లో మాట్లాడిన విద్యార్థులను అభినందిస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

శభాష్ పిల్లలూ..

ఇంగ్లిష్‌లో అదరగొట్టిన విద్యార్థులను అభినందించిన కలెక్టర్

వికారాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఇంగ్లిష్‌లో మాట్లాడడం హర్షణీయమని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం యంగ్ ఓరేటర్స్ క్లబ్, బొస్చ్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఇంగ్లిష్‌పై ఆసక్తిని పెంచేలా విద్యార్థులకు బోధించాలని, పిల్లలు సైతం మాతృ భాషతోపాటు ఇంగ్లిష్ కూడా నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రేణుకాదేవి, వైఓసీ సభ్యులు పాల్గొన్నారు.

పరిహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం అందజేస్తున్న నష్ట పరిహారాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. కలెక్టరేట్‌లో పారిశ్రామిక పార్కుకు భూములిచ్చిన కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం హకీంపేట రైతులకు ఒకే విడతలో నష్ట పరిహారం చెక్కులు అందించారు. 32 మంది రైతులు 29 ఎకరాలను పారిశ్రామిక పార్క్‌కు అందజేశారు. వారికి నష్ట పరిహారం కింద రూ.5.80 కోట్ల విలువైన చెక్కులు మంజూరయ్యాయి. కార్యక్రమంలో తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, దుద్యాల తహసీల్దార్ కిషన్, సూపరింటెండెంట్ నాఫిస్ ఫాతిమా, టీఎస్ఐఐసీ అసిస్టెంట్ మేనేజర్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూములపై హక్కులు

కల్పించండి

» శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

తాండూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): అటవీ భూముల్లో 30, 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పేద రైతులకు హక్కులు కల్పించాలని ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి కోరారు. గురువారం శాసన మండలిలో స్పెషల్ మెన్షన్ అంశాలపై జరిగిన చర్చలో ఆయన పాల్గొని మాట్లాడారు. వికారాబాద్ జిల్లాలోని అటవీ ప్రాంతాల్లోని భూములను గిరిజన, ఇతర రైతులు సాగు చేసుకుంటున్నారని, ఈ భూములను అటవీ అధికారులు స్వాధీనం చేసుకొనే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాలతోపాటు వికారాబాద్ పరిసర ప్రాంతాల్లో ఏళ్లుగా సాగులో ఉన్నారని, ఆ రైతులకు భూములే జీవనాధరమని పేర్కొన్నారు. గతంలోనూ ఈ సమస్య పరిష్కారం కోసం ప్రయత్నించామని, ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. ఈ విషయంలో అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ సాగులో ఉన్న రైతుల ఇబ్బందులు తొలిగించి భూమిపై యాజమాన్య హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

రేషన్ షాపులకు సన్న బియ్యం తరలించాలి

» అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉగాదిని పురస్కరించుకొని ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో సకాలంలో రేషన్ షాప్‌లకు సన్న బియ్యాన్ని తరలించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి గోదాం ఇన్‌చార్జిలను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో గోదాం ఇన్‌చార్జిలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు అవసరమైతే అదనపు వాహనాలు సమకూర్చుకోవాలన్నారు. డీలర్లు తూకంలో తేడా లేకుండా బియ్యం పంపిణీ చేయాలన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సుగుణాబాయి, గోదాం ఇన్‌చార్జిలు, డీలర్లు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ పంట రుణం

» రూ.కోటీ 20లక్షల లాభంలో ఎల్మకన్నె సహకార సంఘం

» డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్

తాండూరురూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎల్మకన్నె సహకార సంఘం పరిధిలో భూమి ఉన్న ప్రతి రైతుకూ పంట రుణం అందిస్తామని డీసీసీబీ వైస్ చైర్మన్, ఎల్మకన్నె సహకార సంఘం చైర్మన్ రవీందర్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం తాండూరు మండలం ఎల్మకన్నె సహకార సంఘంలో సీఈవో శ్రీనివాస్, అడిషనల్ సీఈవో చంద్రారెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని సహకార సంఘాల్లో ఎల్మకన్నె సహకార సంఘం బంగారు తాకట్టుపై రూ.22కోట్ల 60లక్షల రుణాలు అందించి మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు. 338 మంది రైతులకు రూ.2కోట్ల 29లక్షల రుణమాఫీ వర్తించిందని తెలిపారు. 120 మంది కొత్త రైతులకు పంట రుణాల కింద రూ.కోటీ 50లక్షలు అందించామని, 20 మంది రైతులకు దీర్ఘకాలిక రుణాల కింద రూ.కోటి అందించినట్లు పేర్కొన్నారు. సంఘం పరిధిలో పౌల్ట్రీ ఫాం, గేదెలు, గొర్రెల పెంపకానికి రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఎల్మకన్నె సహకార సంఘం రూ.కోటీ 20లక్షల లాభంలో కొనసాగుతుందన్నారు. దీర్ఘకాలిక రుణాల కింద 26 మంది రైతులకు సంబంధించి రూ.40లక్షలు మొండి బకాయిలు ఉన్నాయన్నారు. సహకార సంఘం పాలకవర్గ గడువు ముగిసినా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో మరో ఆరు నెలలు పొడిగించారని పేర్కొన్నారు. సమావేశంలో సహకార సంఘం డైరెక్టర్లు పి.వెంకట్రామిరెడ్డి, పెండ నర్సింహులు, బి.పార్వతమ్మ, అమృతయ్యగౌడ్, బి.రాఘవేందర్, సిద్ధయ్యస్వామి, వడ్ల బిచ్చన్న, కాంగ్రెస్ నాయకులు మల్లయ్య తదితరులున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట్, మార్చి27 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. హార్టికల్చర్ ద్వారా 75శాతం సబ్సిడీతో మంజూరైన స్ప్రింక్లర్లను ఆయన గురువారం రైతులకు అందించారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. రైతులకు సబ్సిడీపై పనిముట్లను ఇవ్వకుండా గత ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు వ్యవసాయ పనిముట్లు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, సీనియర్ నాయకులు రాంచంద్రారెడ్డి, వెంకట్రాములుగౌడ్, దేశ్యానాయక్, హార్టికల్చర్ అధికారి సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సబ్సిడీ పరికరాలను అందిస్తున్న రాజేశ్‌రెడ్డి



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న అధికారులు

వర్షానికి దెబ్బతిన్న పంటల పరిశీలన

దుద్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలుముల్‌మైలారం గ్రామంలో సోమవారం అకాలంగా కురిసిన వడగళ్ల వర్షంతో నష్టపోయిన రైతుల పంట పొలాలను వ్యవసాయ శాఖ కొడంగల్ ఏడీఏ శంకర్‌రాథోడ్, ఏవో హిమబిందు గురువారం పరిశీలించారు. కోతకు వచ్చే సమయంలో వరి పొలాల్లో 40-50 శాతం వరకు వడ్లు రాలినట్లు గుర్తించారు. అదేవిధంగా పొట్ట దశకు వచ్చిన తరుణంలో వరి పంటకు తీరని నష్టం వాటిల్లిందని రైతులు అధికారులతో వాపోయారు. 20మంది రైతులకు చెందిన 100 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రపంచ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని ఎస్ఎంఎస్ఈ మాజీ అసిస్టెంట్ డైరెక్టర్ కేసీ చౌదరి తెలిపారు. పోచారం మున్సిపాలిటీ దివ్యానగర్ నల్ల మల్లారెడ్డి ఇంజనీరింగు కళాశాలలో రెండురోజుల పాటు నిర్వహించనున్న టెక్‌ఫెస్ట్-2025ను గురువారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పుడు కొత్తగా సృజనాత్మకంగా ఆలోచిస్తూ ప్రతిభను విస్తరించాలన్నారు. ఉద్యోగాల కోసమే కాకుండా పరిశ్రమల స్థాపనకు యువత కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీయూ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటరమణ, నల్ల మల్లారెడ్డి విద్యాసంస్థల చైర్మన్ నల్లా మల్లారెడ్డి, డైరెక్టర్ దివ్యా నల్ల, కోశాధికారి స్నేహ నల్ల, ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీఎస్ రమేష్, వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నల్లమల్లారెడ్డి, తదితరులు

ఘనంగా ఏక్ భారత్-శ్రేష్ఠ్ భారత్

ఇబ్రహీంపట్నం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉప్పరిగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులచే ఏక్ భారత్-శ్రేష్ఠ్ భారత్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. హర్యానా సంస్కృతి, భాష, వేషధారణ, ఆహారం, నృత్యాలు, ముఖ్య ప్రదేశాలపై టీచర్లు విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిత్రలేఖనం, వ్యాసరచన, నృత్య, ఉపన్యాస, వేషధారణ పోటీలు నిర్వహించారు. మధ్యాహ్న భోజనంలో హర్యానా వంటకాలైన రోటీ, దాల్ వడ్డించారు. హెచ్‌ఎం వి.కనకమహాలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

చేవెళ్ల/కందుకూరు/కడ్తాల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ అని ఎమ్మెల్యే కాలెయాదయ్య అన్నారు. గురువారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో అట్లాస్ గార్డెన్‌లో ముస్లింలకు ప్రభుత్వం తరపున ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే పాల్గొని వారితో కలిసి విందులో పాల్గొన్నారు. తహసీల్దార్ కృష్ణయ్య, డీటీ రాజేంద్రకుమార్, నాయకులు ఎం.యాదగిరి, బాసిత్, హాజీ, మైనారిటీ నాయకులు ఉన్నారు. అలాగే మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని బీఆర్ఎస్ నేత పట్లోళ్ల కౌశిక్‌రెడ్డి అన్నారు. కందుకూరు మండలం లేమూరులో మైనారిటీ నాయకుడు నసీర్‌అహ్మద్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. మైనారిటీ నాయకులు ఎండీ దావూద్, మీనాక్ష పటేల్, సయ్యద్ ఇమ్రాన్, ప్రభాకర్, రియాజ్, ఇలియాస్,తదితరులున్నారు. మండల కేంద్రంలో ఎండీ చోటు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. కడ్తాల్ మండలకేంద్రంలోని మజీద్ ఖుబాలో మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. షబ్ ఏ ఖదర్‌ను పురస్కరించుకొని మజీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షుడు జావిద్, నాయకులు జహంగీర్ అలీ, లాయక్‌అలీ, జహంగీర్‌బాబా, ఇర్షాద్, ఆమిర్, షకీల్, ఇద్రీస్, ఫరూఖ్ పాల్గొన్నారు.



కందుకూరు: ఇఫ్తార్‌లో కౌశిక్‌రెడ్డి



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే యాదయ్య

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం



నియామకపత్రాన్ని అందజేస్తున్న శ్రీజ్యోతిభీంభరత్

షాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకొని సత్తా చాటాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీంభరత్ అన్నారు. గురువారం చేవెళ్ల నియోజకవర్గం ఏ-బ్లాక్ వైస్ ప్రెసిడెంట్‌గా షాబాద్ మండలం సర్దార్‌నగర్‌కు చెందిన పల్లాటి అశ్వినిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు ఆమె నియామకపత్రాన్ని అందజేశారు. చేవెళ్ల నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రమ్యశ్రీరెడ్డి, మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్ మండలాధ్యక్షురాళ్లు కావ్య, పుష్పమ్మ, స్వరూప తదితరులు ఉన్నారు.

మైసిగండి ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపులో సిరోలిపంతూ, ఈవో స్నేహలత

కడ్తాల్, మార్చి27(ఆంధ్రజ్యోతి): మైసిగండి మైసమ్మ ఆలయంలో మంగళవారం హుండీ ఆదాయం లెక్కింపు చేపట్టారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ రామావత్ సిరోలిపంతూ, ఈవో స్నేహలత, జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్‌ల సమక్షంలో హుండీలను లెక్కించారు. 60 రోజులకు గాను రూ. 12,01,567 ఆదాయం లభించినట్లు ఈవో తెలిపారు. ఆర్‌పీ భాస్కర్, అరుణ్, యాదగిరి, చంద్రయ్య, కృష్ణ, పోలీసు, ఆలయ సిబ్బంది, వీజీఎల్ అన్నపూర్ణ సేవా ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సైదాన్‌కు డాక్టరేట్



సైదాన్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

ఇబ్రహీంపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నంలోని సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుడు డి.సైదాన్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఆన్ ఎఫీషియంట్ బ్రెయిన్ ట్యూమర్ క్లాసిఫికేషన్ ఫ్రమ్ ఎమ్మారై ఇమేజెస్ యూసింగ్ డీప్ లెర్నింగ్ మోడల్స్ అనే అంశంపై రిటైర్డ్ ప్రొఫెసర్ పి.ప్రేమ్‌చంద్, సీఎస్ఈ డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ పీవీ సుధ ఆధ్వర్యంలో ప్రయోగాత్మక పరిశీలన గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి అందజేశారు. ఈమేరకు ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. గురువారం కళాశాలలో సెక్రటరీ డా.ప్రదీప్‌కుమార్, ప్రిన్సిపాల్ శేఖర్‌బాబు, అధ్యాపక బృందం ఆయన్ను అభినందించారు.

పేద విద్యార్థులకు చేయూతనిస్తాం



ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న గౌరవ్‌గార్గ్

శంషాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలు విద్యనభ్యసించడానికి ఇబ్బందులు పడకుండా అవసరమైన చేయూతనందించడమే లక్ష్యంగా రౌండ్‌టేబుల్ ఇండియా స్వచ్ఛంద సంస్థ పనిచేస్తుందని ఆసంస్థ డైరెక్టర్ గౌరవ్ గార్గ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా కోత్వాల్‌గూడ ప్రాథమికోన్నత పాఠశాలలో స్వచ్ఛంద సంస్థ సహకారంతో నిర్మించిన మూడు అదనపు తరగతి గదుల ప్రాంగణాన్నిఆయన గురువారం ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థ సభ్యులు నాగలక్ష్మి, చైతన్యచిన్నం, మక్సూద్‌హైమద్, హర్షిత్‌సేథ్, లోకేశ్వర్‌రెడ్డి అఖిల్ కోత్వాల్‌గూడ మాజీ సర్పంచ్ శ్రీనుగౌడ్, శేఖర్‌గుప్తా, బాల్‌రెడ్డి, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై న్యాయ విచారణ చేపట్టాలి

శంకర్‌పల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ప్రభుత్వం న్యాయ విచారణ చేపట్టాలని చేవెళ్ల నియోజకవర్గ పాస్టర్ల అధ్యక్షుడు అబ్రహం డిమాండ్ చేశారు. ఇటీవల మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ మృతిపై ఎన్నో అనుమానాలున్నాయని ప్రకటనలో తెలిపారు. పోలీసులు వెంటనే విచారణ జరిపించి ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఉచిత శిక్షణతో స్వయం ఉపాధి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న బ్యాంకు సిబ్బంది

కోట్‌పల్లి, మార్చి27 (ఆంధ్రజ్యోతి): ఉచిత కుట్టుమిషన్ శిక్షణతో మహిళలకు స్వయం ఉపాధి కలుగుతుందని ఎస్‌బీఐ డైరెక్టర్ రమేష్ అన్నారు.బార్వాద్ రైతువేదికలో గురువారం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఎస్‌బీఐ చిలుకూరివారి సౌజన్యంతో కుట్టుమిషన్ కార్యక్రమం ప్రారంభించారు. ఉపాధిహామీలో 100 రోజులుపూర్తి చేసుకున్న మహిళలకు శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, శివయ్య, అరుణ, మల్లేశం, నర్సింహులు, శశికళ, నిర్మల, గణేష్, నాగిరెడ్డి, మల్లేశం, గోపాల్ పాల్గొన్నారు.

విషపదార్థం తిని గేదె మృత్యువాత!

యాచారం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వేటగాళ్లు అడవి పందుల కోసం పెట్టిన విష పదార్థం తిని రూ.లక్ష విలువ చేసే పాడిగేదె మృత్యువాత పడింది. ఈ ఘటన యాచారం మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన ప్రశాంత్‌రెడ్డి రూ.లక్ష విలువ చేసే గేదెను కొనుగోలు చేశాడు. దానితో పాటు మరో గేదెను పెంచుకుంటూ జీవనం సాగిస్తునాడు. ఈక్రమంలో పొలంలో మేత మేయడానికి వదలి పెట్టాడు. అయితే, అడవిపందుల కోసం పెట్టిన విషం తినడంతో గేదె దంతాలు పగిలిపోయాయి. దాంతో అది అక్కడికక్కడే మృత్యువాత పడింది. మరో 20రోజుల్లో ఆ గేదె ఈననుందని బాధిత రైతు తెలిపాడు. సంఘటనా స్థలానికి పశుసంవర్ధకశాఖ అధికారులు వెళ్లి విచారణ చేపట్టారు.

అసెంబ్లీ తీర్మానంపై హర్షం



వికారాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): లంబాడ భాషను పురాతన భాషగా గుర్తించేందుకు షెడ్యూల్ 8లో చేర్చాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల అఖిల భారత గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాఘవన్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. లంబాడ భాషను పురాతన భాషగా గుర్తించాలని కోరుతూ గురువారం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించిన తీర్మానాన్ని అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించడానికి కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. లంబాడ భాషను పురాతన భాషగా గుర్తించాలని చాలా కాలంగా గిరిజనులు ఉద్యమాలు చేస్తున్నా కార్యరూపం దాల్చలేదన్నారు. చివరకు రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం లంబాడ భాషను పురాతన భాషగా గుర్తించాలని కోరుతూ తీర్మానం చేసి కేంద్రప్రభుత్వానికి పంపించి గిరిజనులపట్ల తమ అభిమానాన్ని చాటుకున్నదని ఆయన చెప్పారు.

ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో రామ్మోహన్‌రెడ్డి భేటీ



పరిగి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గేతో గురువారం పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి భేటీ అయ్యారు. మంత్రివర్గ విస్తరణలో తమకు స్థానం కల్పించాలని కోరారు. అదేవిధంగా తెలంగాణలో అమలవుతున్న పథకాలపై వివరించారు. పథకాలపై పట్ల ప్రజల్లో స్పందన ఎలా ఉందని ఖర్గే రామ్మోహన్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు.



సయ్యద్‌పల్లిలో పూజలు చేస్తున్న పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

వీరాంజనేయస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

పరిగి,మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సయ్యద్‌పల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ వీరాంజనేయస్వామి వార్షికోత్సవాలు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు, పార్టీ నాయకులు పి.వెంకటయ్య, రవీంద్రారెడ్డి, వెంకటరామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

90శాతం రాయితీతో ఆస్తి పన్ను చెల్లించాలి

శామీర్‌పేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పేరుకపోయిన ఆస్తిపన్నులను 90శాతం రాయితీతో చెల్లించడానికి ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ తెలిపారు. తూంకుంట మున్సిపల్ పరిధిలో గురువారం కమిషనర్ వెంకటగోపాల్ పర్యటిస్తూ పోరుకపోయిన ఆస్తి పన్నుల వసూళ్లకు మున్సిపల్ బిల్‌కలెక్టర్లతో ప్రత్యేక క్యాంపేయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా తూంకుంటలోని పలు ఇళ్లలోకి కమిషనర్ వెళ్లి ఆస్తి పన్నుల చెల్లింపు విషయంలో ప్రభుత్వం ఇచ్చిన 90 శాతం రాయితీ పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. పేరుకపోయిన ఇంటి పన్నులను వెంటనే చెల్లించి 90శాతం రాయితీని లబ్ధిపొంది మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడాలని కమిషనర్ పిలుపు నిచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన గడువులోపు చెల్లించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని కమిషనర్ పిలుపు నిచ్చారు.



క్యాన్సర్ అవగాహన సదస్సుల్లో పాల్గొన్న విద్యార్థులు

క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

మేడ్చల్ టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని వణికిస్తున్న క్యాన్సర్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ నబత్ లఖాని అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆటిజం క్యాన్సర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన డాక్టర్ నబత్ లఖాని మాట్లాడుతూ.. ప్రపంచాన్ని వణికిస్తున్న క్యాన్సర్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్యామ లఖాని, కళాశాల కార్యదర్శి టీవీ.రెడ్డి, డైరెక్టర్ సరోజారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, పీఆర్‌వో రవి, సుధాకర్ పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మోమిన్‌పేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో మోమిన్‌పేట్ మండలంలోని బురుగుపల్లి పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. వికారాబాద్ జిల్లా విద్యాశాఖ మానిటర్ రాము గురువారం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించి మెమోంటోలు, ప్రశాంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు వీరేశం, తెలంగాణ ఆపరేషన్ మేనేజర్ కాశీనాథ్, జిల్లా సీనియర్ మెంటర్లు నాగరాజు, రాజు, చిరంజీవి, సత్యానందం, రమేశ్, యాదయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చాన్స్ దక్కేనా?

(ఐదో పేజీ తరువాయి)

భర్తీచేస్తే ఉమ్మడి జిల్లాకు అవకాశం దక్కొచ్చని ముఖ్యనేతలు చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో కాంగ్రెస్ నుంచి విజయం సాధించిన ఐదుగురు ఎమ్మెల్యేలు గ్రామీణ ప్రాంతాల నుంచే గెలుపొందారు. వీరిలో సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండగా వికారాబాద్ నుంచి గెల్చిన ప్రసాద్‌కుమార్ స్పీకర్‌గా కొనసాగుతున్నారు. ఈ రెండూ కీలక పదవులే కావడంతో ఉమ్మడి జిల్లా నుంచి కొత్తగా మరొకరికి మంత్రివర్గంలో ప్రాధాన్యం దక్కే అవకాశాలు కన్పించడం లేదు. ఇదిలా ఉంటే పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిలు మంత్రివర్గంలో స్థానం ఆశిస్తున్నారు. కొందరు కాంగ్రెస్ పెద్దలతో తనకున్న పరిచయాలతో టి.రామ్మోహన్‌రెడ్డి మంత్రి పదవి కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అలాగే మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా తానే అందరికంటే సీనియర్ అని, తనకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఆయన ఇటీవల పార్టీ పెద్దలన కలిసేందుకు ఢిల్లీ వెళ్లినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే లోక్‌సభ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి కూడా మంత్రివర్గంలో అవకాశం కోసం ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే పార్టీ ఫిరాయింపులపై కోర్టుల్లో వివాదాలు కొనసాగుతుండడం మహేందర్‌రెడ్డికి ప్రతిబంధంగా మారింది. ఆయనకు ఇప్పటికే మండలిలో చీఫ్‌విప్ పదవి ఇవ్వడంతో ఆయన కొంత సంతృప్తికరంగానే ఉన్నారు. ఇదిలా ఉంటే జిల్లా నుంచి మంత్రి పదవి ఆశిస్తున్న ముగ్గురు కూడా పదవిని సంపాదించేందుకు వారి సామాజికవర్గం మైనస్‌గా మారింది. ఇదే సామాజికవర్గానికి చెందిన ఇతర జిల్లాల ఎమ్మెల్యేలకు ఇప్పటికే అధిష్ఠానం నుంచి హామీ రావడంతో ఇక్కడ అవకాశాలు లేవని ముఖ్యనేతలు చెబుతున్నారు. ఇక ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు ఇంతకు ముందు మంత్రివర్గంలో చాన్స్ కోసం యత్నించినా ప్రస్తుతం మౌనంగానే ఉన్నారు. ఇదిలా ఉంటే మంత్రివర్గంలో చాన్స్ కోసం ప్రయత్నిస్తున్న ఇద్దరిలో ఒకరికి చీఫ్‌విప్ పదవి ఇస్తామని హామీ ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.

ఎంపీడీవో కార్యాలయంలో పాము కలకలం



తాండూరు రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : తాండూరు ఎంపీడీవో కార్యాలయంలో నాగు పాము కలకలం రేపింది. గురువారం ఉదయం ఎంపీడీవో కార్యాలయం గదిలో అటెండర్ శుభ్రం చేసేందుకు వెళ్లాడు. గదిలో ఒక మూలన నాగు పాము కనిపించింది. అటెండర్ వెంటనే భయంతో బయటికి వచ్చి సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. వెంటనే సిబ్బందికి వచ్చి పామును కర్రతో కొట్టి చంపారు. పామును చంపేయడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ఎంపీడీవో కార్యాలయంతోపాటు ఇక్కడ ఉన్న ఏపీవో, ఎంఈవో, ఐకేపీ, డీఎల్‌పీవో తదితర కార్యాలయాల వెనుక భాగంలో ముళ్లపొదలు ఉండటంతో పాములు తిరుగుతున్నాయని సిబ్బంది పేర్కొన్నారు. దీంతో ఎక్కడి నుంచి ఏపాము కార్యాలయం గదుల్లో చేరుతున్నాయో తెలియడం లేదని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

స్లాబ్‌కే మోడల్ మార్కెట్ పరిమితం



స్లాబ్‌లకే పరిమితమైన మోడల్ మార్కెట్ భవనం

నిధులకు గ్రహణం

- ఏడాదిన్నరగా నిలిచిన నిర్మాణాలు
- రోడ్లపైనే కూరగాయలు, మాంసం విక్రయాలు

షాద్‌నగర్ అర్బన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లో చేపట్టిన సమీకృత(ఇంటిగ్రేటెడ్) మార్కెట్ నిర్మాణానికి నిధులు రాక పనులు నిలిచాయి. ఏడాదిన్నరగా పనులు పునఃప్రారంభం కాలేదు. కూరగాయలు, మటన్, చికెన్, చేపలు, పూలు రోడ్లపక్కనే అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో ప్రజలకు, వాహనదారులకు ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. గతంలో షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయానికి ఆనుకొని ఉన్న కూరగాయల మార్కెట్ యార్డును చౌడమ్మగుట్ట వద్ద నిర్మించిన నూతన మార్కెట్ యార్డుకు తరలించారు. మార్కెట్‌కు యార్డులోని రెండెకరాల స్థలాన్ని మోడల్ మార్కెట్‌కు కేటాయించారు. నిర్మాణానికి రూ.4.5కోట్లను గత ప్రభుత్వం మంజూరు చేయడంతో పనులు చేపట్టారు. మాంసం, చికెన్, చేపలు, పూల విక్రయాలు ఒకే సముదాయంలో నిర్వహించుకునేలా ప్రణాళిక రూపొందించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో రెండు వైపులా దుకాణాలను నిర్మించి, వాటికి అనుసంధానంగా రేకులతో పైకప్పు వేసేలా పనులు చేపట్టారు. గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్తు నిర్మించాలని ఒక సముదాయానికి రెండు స్లాబ్‌లు వేశారు. రెండో సముదాయానికి ఫుటింగ్‌లు, బేస్మెంట్ పిల్లర్లను వేశారు. పనులు చేసిన కాంట్రాక్టర్‌కు బిల్లులు రాక, ఆ లోపే కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపేశారు. సవరించిన అంచనాల మేరకు రూ.11కోట్లు కేటాయిస్తూ గత ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. ఇందుకు పరిపాలన అనుమతులు వచ్చేలోగానే ప్రభుత్వం మారడం, నిధులు రాక కాంట్రాక్టర్ పనులాపేశాడు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషిచేస్తేనే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయ్యే పరిస్థితులున్నాయి.



పునాదులకు పరిమితమైన షెడ్డు

నిధులు రాకే నిర్మాణం ఆగింది



నిధులు విడుదలకాకే సమీకృత మార్కెట్ భవన నిర్మాణం నిలిచింది. మొదట మంజూరైన 4.5కోట్లతో చేపట్టిన పనులు మరిన్ని నిధులు అవసరం కాగా ప్రతిపాదనలు పంపాం. ఈ మేరకు జీవో విడుదలైంది. పరిపాలన అనుమతులు రావాలి. చేసిన పనులకు బిల్లులొచ్చి, అదనపు నిధులు విడుదలైతే పనులు పునఃప్రారంభమవుతాయి.

సాజిద్, పబ్లిక్ హెల్త్ డీఈ, షాద్‌నగర్ మున్సిపాలిటీ

నిధులిచ్చి పనులు ప్రారంభించాలి



షాద్‌నగర్ ప్రజలకు ఉపయోగకరంగా ఉండే సమీకృత మార్కెట్ పనులను పూర్తిచేసేలా ప్రభుత్వం నిధులివ్వాలి. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించి మిగిలిన పనులు పూర్తయ్యేలా చూడాలి. షాద్‌నగర్ నడిబొడ్డున రెండెకరాల్లో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను పూర్తిచేస్తే కూరగాయలు, మాంసం, చికెన్, పూలు, పండ్లు, చేపల విక్రేతలకు, ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయి.

- కె.నరేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్, షాద్‌నగర్

సీసీరోడ్ల పనులు ప్రారంభం

బొంరాస్‌పేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నాందర్‌పూర్‌లో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు మల్లేశ్ గురువారం పంచాయతీ కార్యదర్శి రాణి, కాంగ్రెస్ నాయకులతో కలిసి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఆదేశానుసారం పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటయ్య, మాజీ సర్పంచ్ శ్రీశైలం, నాయకులు పాల్గొన్నారు.

పూడూరు: చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నిధులతో మండల పరిధిలోని కంకల్ గ్రామంలో సీసీరోడ్డు పనులు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవీందర్ కంకల్, రామచంద్రయ్య, విఠల్, శంకర్, అశోక్, అనంతయ్య పాల్గొన్నారు.

ఇసుక అక్రమ డంపుల వేలం

బొంరాస్‌పేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుప్‌చర్ల గ్రామ శివారులో అక్రమంగా డంపు చేసిన ఇసుకను ఇటీవలే రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. గురువారం సీజ్ చేసిన 19 ట్రాక్టర్ల ఇసుకకు వేలం నిర్వహించగా మైసమ్మ ఆలయం దగ్గర ఉన్న 12 ట్రాక్టర్ల ఇసుకను అనవేని శ్రీనివాస్ రూ.7500, కలం గట్టు దగ్గర ఉన్న ఏడు ట్రాక్టర్ల ఇసుకను శిరీష రూ.4500కు దక్కించుకున్నారు.

వికారాబాద్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

- రోడ్ల నిర్మాణంలో నియోజకవర్గానికి ప్రాధాన్యం
- ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



వికారాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రోడ్ల నిర్మాణంలో వికారాబాద్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దే బాధ్యత తనదని, సీఎం రేవంత్ రెడ్డిదని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సభాధ్యక్షుడిగా మిమ్మల్ని అందరూ అజాత శత్రువని అంటారని ప్రసాద్‌కుమార్‌ను కీర్తించారు. సభలో గురువారం ఆర్‌అండ్‌బీ శాఖపై చర్చ జరుగుతున్న సమయంలో వికారాబాద్ బైపాస్ రోడ్డు నిర్మాణంపై ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వాటిని సీఎం వద్దకు పంపించాలని స్పీకర్ మంత్రి కోమటిరెడ్డికి సూచించారు. మొదటి ఫేజ్‌లోనే వికారాబాద్‌లో అన్ని రోడ్ల పనులు చేపడతామని మంత్రి చెప్పారు. తాండూరు నియోజకవర్గం కూడా వెనుకబడిన ప్రాంతమని, జహీరాబాద్ నుంచి జాతీయ రహదారి ఏర్పాటుపై ప్రతిపాదన ఉందన్నారు. ఈసారి ఢిల్లీ వెళ్లినప్పుడు సీఎంతోపాటు తమరు కూడా రావాలని స్పీకర్‌ను కోరారు. అప్ప జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు రోడ్డు విస్తరణ పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని, చెట్లను ట్రాన్స్‌లొకేట్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. 2021లో మంజూరైన ఈ రోడ్డు పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్‌ను కూడా మొబిలైజ్ చేశామని, ఆ పనులు కొనసాగేలా సమీక్షిస్తున్నామని పేర్కొన్నారు.

గుట్టల బేగంపేట్ భూములపై 'స్టేటస్‌కో'

హైదరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేట్‌లోని సర్వే నెంబర్ 63లో ఉన్న దాదాపు 78 ఎకరాల భూమి స్వరూపాన్ని మార్చకుండా యథాతథ స్థితి(స్టేటస్ కో) కొనసాగించాలని హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాలు జారీచేసింది. ఈ భూమి విషయంలో బుక్కార్‌ఖాన్ ఇతర కుటుంబ సభ్యులకు అనుకూలంగా హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఖాజా కరీముల్లాఖాన్ తదితరులు హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేశారు. తప్పుడు పత్రాల ఆధారంగా సింగిల్ జడ్జి ప్రతివాదులకు అనుకూలంగా తీర్పు ఇచ్చారని.. సుదీర్ఘకాలంగా కబ్జాలో ఉన్నంత మాత్రాన భూమి వారిదైపోదని పేర్కొన్నారు. సింగిల్ జడ్జి 1962 నుంచి మాత్రమే చరిత్రను పరిశీలించి తీర్పు ఇచ్చారని.. అంతకుముందున్న చరిత్రను పట్టించుకోలేదని పేర్కొన్నారు. ప్రతివాదులను ప్రభుత్వమే స్వయంగా ఆక్రమణదారులుగా గుర్తించినప్పటికీ సింగిల్ జడ్జి సదరు విషయాన్ని పట్టించుకోలేదని తెలిపారు. ప్రతివాదుల తరఫున న్యాయవాదులు వాదిస్తూ.. అప్పీలుదారులు తప్పుడు పత్రాలు సృష్టించి ప్రభుత్వ అధికారుల సహాయంతో భూమిని ఆక్రమించాలని చూస్తున్నారని.. ఈ విషయాన్ని సింగిల్ జడ్జి గుర్తించి తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. అన్నివర్గాల వాదనలు విన్న తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం వివాదం తేలేవరకు వివాదాస్పద భూమి విషయంలో అన్ని పక్షాలు యథాతథ స్థితి కొనసాగించాలని స్పష్టంచేసింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా పడింది.



అగ్నివీర్‌లో సైనికులుగా ఎంపికైన విష్ణు, శివ



ఎంపికైన ఇప్పాయిపల్లి గ్రామ యువకులు

అగ్నివీర్‌కు యువకుల ఎంపిక

ధారూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం భారత సైన్యంలో సైనికుల నియమాకం కోసం చేపట్టిన అగ్నివీర్‌లో అన్నదమ్ములైన పల్లెటూరి యువకులు సైనికులుగా ఎంపికయ్యారు. మండలంలోని తరిగోపుల గ్రామానికి చెందిన మల్లేశంకు నలుగురు మగ సంతానం. వీరిలో విష్ణు, శివ ఇద్దరు అన్నదమ్ములు. అగ్నివీర్ పరీక్ష రాసేందుకు వీరిద్దరూ సికింద్రాబాద్‌లోని ఓ కోచింగ్ సెంటర్‌లో కోచింగ్ తీసుకున్నారు. అగ్నివీర్ పరీక్షలో విష్ణు, శివలు ఉత్తీర్ణత సాధించి సైనికులుగా ఎంపికయ్యారు. భారత సైన్యంలో సైనికులుగా దేశరక్షణ, సేవచేసే తమ గ్రామానికి చెందిన ఇద్దరికి అవకాశం రావటం గర్వకారణమని కుటుంబసభ్యులు, గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కులకచర్ల: ఆర్మీ ఎంపిక ప్రక్రియలో భాగంగా గత 6నెలల క్రితం అగ్నిపథ్ ఎంపిక నిర్వహించారు. అందుకు సంబంధించిన ఫలితాలు గురువారం ప్రకటించారు. కులకచర్ల మండలంలోని ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన గణేశ్‌గౌడ్, అభిలాష్ ముదిరాజ్, అఖిల్‌యాదవ్ ఎంపికయ్యారు. వీరి ఎంపిక పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

డ్రగ్స్, గంజాయి విక్రయాలపై దృష్టి పెట్టండి



ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డితో మాట్లాడుతున్న అవినాష్ మహంతి

షాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయి విక్రయాలపై దృష్టి సారించి, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి అన్నారు. గురువారం షాబాద్ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఫైల్స్‌ను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న కేసులపై ఆరా తీశారు. డ్రగ్స్, గంజాయి విక్రయాలపై సీరియస్‌గా దృష్టి పెట్టాలని, అనుమానిత ప్రాంతాలు, వ్యక్తులపై నిఘా పెట్టాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తు ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్ ఉండవద్దన్నారు. పోలీస్ స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను చూసి మెచ్చుకున్నారు. సమస్యలుంటే నేరుగా తనకు వివరించాలన్నారు. పోలీస్ సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. నేరాల అదుపుపై దృష్టి సారించాలన్నారు. రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, చేవెళ్ల ఏసీపీ కిషన్, షాబాద్ ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి, ఎస్సై రమేష్, సిబ్బంది ఉన్నారు.

బీజేపీ గెలుపులో నర్సింహారెడ్డి పాత్ర కీలకం



నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న చేవెళ్ల బీజేపీ నాయకులు

చేవెళ్ల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడిగా జిల్లాకు, పార్టీకి తొమ్మిదేళ్లు సేవలందించిన బొక్క నర్సింహారెడ్డిని చేవెళ్ల మండల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈమేరకు బీజేపీ చేవెళ్ల మండలాధ్యక్షుడు అనంతరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి సన్మానించారు. అనంతరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రతీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ, ప్రతీ కార్యక్రమాన్ని ముందుండి విజయవంతం చేయడంలో నర్సింహరెడ్డి కీలకపాత్ర పోషించాడన్నారు. నాయకులు ఆంజనేయులుగౌడ్, వైభవ్‌రెడ్డి, శర్వలింగం, ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, భాస్కర్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అభిలాష్‌రెడ్డి, బాబు, వెంకటేశ్, చేగూరి ప్రవీణ్, బాల్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, జైసింహరెడ్డి, శ్రీతం విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

మోదీది అప్రజాస్వామిక పాలన



మాట్లాడుతున్న వినోద్

మహేశ్వరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రధాని నరేంద్రమోదీ పాలన పూర్తిగా అప్రజాస్వామికంగా కొనసాగుతోందని, దీనికి నిరసనగా ఏప్రిల్ 2నుంచి పల్లెపల్లెన జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పీసీసీ ప్రధాన కార్యదర్శి, జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమ ఇన్‌చార్జి వినోద్ అన్నారు. గురువారం తుక్కుగూడలోని మహేశ్వరం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ అధ్యక్షతన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగం, అంబేడ్కర్‌పై అమిత్‌షా, పలువురు బీజేపీ నేతలు చేస్తున్న దాడి, దేశాన్ని ముక్కలు చేస్తున్న బీజేపీ తీరుపై కాంగ్రెస్ అధినాయకత్వం దేశవ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో కులగణన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. అంబేడ్కర్, గాంధీజిని దేశం మరిచిపోయేలా బీజేపీ అనేక కుట్రలకు తెరలేసిందన్నారు. బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా దేశ ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని తెలిపారు. మాజీ జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మాజీ మేయర్ పారిజాతనర్సింహరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణానాయక్, ఏనుగు జంగారెడ్డి, ఫ్యూచర్‌సిటీ జేఏసీ చైర్మన్ రఘుపతి, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ యాదయ్య పాల్గొన్నారు.

నర్సరీని పరిశీలించిన ఎంపీడీవో

దోమ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివారెడ్డిపల్లి గ్రామంలో ఎంపీడీవో గ్యామా వన నర్సరీని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం నాటికి ప్రతీ గ్రామ పంచాయతీలో 40 వేల మొక్కలే లక్ష్యంగా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నర్సరీల పట్ల నిర్లక్ష్యంగా వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



శివారెడ్డిపల్లి గ్రామంలో వన నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో గ్యామా

జర్నలిజాన్ని మేల్కొలిపే పాట : స్పీకర్

వికారాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): 'ఇదేనా జర్నలిజం' అని యువ జర్నలిస్టు మహేష్ రాసిన పాట అద్భుతంగా ఉందని, ప్రతి జర్నలిస్టు వినాల్సిన పాట అని తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. అసెంబ్లీ ఆవరణలో గురువారం మహేష్ రచించిన 'ఇదేనా జర్నలిజం' పాటను ఆయన ఆవిష్కరించి వీక్షించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. జర్నలిజం విలువలు, జర్నలిస్టుల బాధ్యతలను గుర్తుచేస్తూ సమాజానికి నాల్గో స్తంభంగా ఉన్న మీడియాను మరింత ఆదర్శంగా ఉంచడానికి ఈగీతం తోడ్పడుతుందని తాను భావిస్తున్నట్లు తెలిపారు.

చిన్నారి వైద్యానికి దాతల సాయం

తాండూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): యాలాల మండలంలోని సంగెం కుర్దు గ్రామానికి చెందిన భానుప్రియ 10నెలల కుమారుడు చిన్నారి వశిష్ట అరుదైన కాలేయ వ్యాధి, బైలేరియా ఆట్రేసే వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో కాలేయ మార్పిడి చికిత్సకు రూ.25లక్షలు కావాల్సి ఉండగా దాతలను ఆశ్రయించారు. ఇందుకు తాండూరుకు చెందిన వ్యాపార సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, పెద్దలు, ప్రజలు అందరి దాతృత్వంతో ఇప్పటివరకు సుమారు రూ.16లక్షల వరకు సమకూర్చారు. బాబు ఆపరేషన్ మాదాపూర్ ఫేస్ ఆస్పత్రిలో చేయనున్నారు. బాబు తల్లిదండ్రులకు దాతలను ప్రోత్సహించడంపై ఆర్‌బీఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్‌రెడ్డికి అధ్యాపకులు పర్యాద రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

గురుకుల్‌కు దిక్కెవరు?

(ఐదో పేజీ తరువాయి)


చదువుకున్న విద్యాలయంలో నేడు ముగ్గురు ఉపాధ్యాయులు, 20 మంది విద్యార్థులు ఉన్నారు. కళాశాల కొనసాగుతున్నప్పటికీ అందులోనూ 60మందికి మించి విద్యార్థులు లేరు.

ఎండోమెంట్‌కు అప్పగించడంతోనే..

ప్రభుత్వాలు గురుకుల్ అభివృద్ధికి కనీస చర్యలు చేపట్టకపోవడంతో గురుకుల్ కష్టాలు ఏయేటికాయేడు పెరుగుతూ వస్తున్నాయి. ఈ సంస్థను ఎండోమెంట్‌కు అప్పగించడంతోనే సమస్యలు మొదలయ్యాయని పలువురు వాపోతున్నారు. గురుకుల్ బాధ్యతలు తీసుకున్నటి నుంచి నేటి వరకు ఎండోమెంట్ పరిధిలో ఒక్క అభివృద్ధి పని చేపట్టక పోగా ఆస్తులు ఆక్రమణలకు గురవుతుంటే చోద్యం చూస్తూ కాలం గడుపుతున్నారు. అక్కడున్న ఉచిత హాస్టల్ సైతం మూతపడటంతోపాటు దేవాదాయ శాఖ అధికారులు గురుకుల్‌కు ఉపాధ్యాయుల నియమకాన్ని నిలిపి వేశారు. దీంతో కొత్త ఉపాధ్యాయులు రాక విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయింది.

అడుగడుగునా ఆక్రమణలే..

నగరంలో 627 ఎకరాల విలువైన, స్థలం, అలాగే ఘట్‌కేసర్‌లో 26 ఎకరాల స్థలం, అనేక భవనాలు, ఉన్నా ఆ విద్యాసంస్థ పరిస్థితి దయనీయంగా మారింది. గురుకుల్ స్థలాన్ని సైతం రోజురోజుకూ ఆక్రమిస్తున్నారు. దీనికితోడు రైల్వే వంతెన నిర్మాణం కోసం కొంత భూమిని సేకరించారు. కొండాపూర్ రోడ్డులోని గురుకుల్ స్థలంలో పెద్ద ఎత్తున రేకుల షెడ్లు వెలిశాయి. దాదాపు ఎకరానికి పైగా స్థలంలో షెడ్లు వెలిశాయి. ఘట్‌కేసర్‌లోని గురుకుల్ పాఠశాలలోని ఉత్తర భాగంలో కొంతభాగంలోనూ అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ఇందులో ఘట్‌కేసర్‌లోని బాలాజీనగర్‌కు చెందిన కొందరు నాయకుల హస్తం ఉందనే ఆరోపణలున్నాయి. ఈ ఆక్రమణలపై పలు మార్లు స్థానికులు అధికారులకు ఫిర్యాదులు చేసినా కనీస చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికే ఈ విద్యాలయాన్ని కాపాడాలని, కోరుతూ స్థానిక మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలకు, ఎంపీలకు వినతి పత్రాలు


ఘట్‌కేసర్‌లోని గురుకుల్ స్థలంలో వెలసిన ఆక్రమణలు

అందజేయడంతో పాటు సీఎంకు పోస్టుకార్డులను పంపే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

కోట్ల రూపాయల నిధులున్నా..

నగరంలోని గురుకుల్ భూమిలో ఉన్న రెండు పెట్రోల్ బంకుల నుంచి నెలకు రూ.3.15లక్షల చొప్పున ఘట్‌కేసర్ ఎస్‌బీహెచ్‌లో జమవుతున్నాయి, అలాగే ఘట్‌కేసర్‌లోని రైల్వే వంతెన నిర్మాణానికి సేకరించిన గురుకుల్ భూమికి రూ.4కోట్ల పరిహారం రావాల్సి ఉంది. ఈ సొమ్ము రంగారెడ్డి కలెక్టర్ ఆధీనంలో ఉన్నట్లు సమాచారం. దీంతో కోట్లాది రూపాయాల ఎఫ్‌డీలు ఉన్నా ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ, గురుకుల్ రాత మారడం లేదు. మహనీయుడు బన్సిలాల్ వ్యాస్ పేదలకు ఉచిత భోజనం ఉచిత విద్యనందించాలనే సంకల్పంతో నెలకొల్పిన విద్యాలయం అధోగతి పాలవుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై పలువురు దాతలు, పూర్వ విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ట్రస్టును ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి



గురుకుల్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయేందుకు నావంతు కృషి చేస్తా. గురుకుల్ ట్రస్టును ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలి. తక్షణమే ఘట్‌కేసర్‌లోని బాలాజీనగర్ లోని ప్రభుత్వ పాఠశాలలను గురుకుల్‌లో విలీనం చేయాలి. నేను ఎమ్మెల్యేగా పని చేసిన సమయంలో ప్రహరీ నిర్మాణానికి రూ.40లక్షలు, భవన నిర్మాణానికి రూ.60 లక్షలు మొత్తం రూ.కోటి కేటాయించాను.

- మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే

గురుకుల్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలి



ఘట్‌కేసర్, గురుకుల్ విద్యాలయం అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ఏం చేస్తున్నారు? ఐదేళ్ల పాటు మంత్రిగా పని చేసిన మల్లారెడ్డి గురుకుల్ గురించి కనీసం పట్టించుకోక పోవడం విచారకరం. ఆయనకు విద్యాలయాలు ఉంటే సరిపోతుందా, పేదలు చదవుకోవడానికి ఇంటర్, డిగ్రీ కళాశాలలు వద్దా? ఇప్పటికైనా స్పందించి గురుకుల్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలి.

- తోటకూర వజ్రేశ్‌యాదవ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు

నవోదయ ఏర్పాటు చేయాలి



ఘట్‌కేసర్ గురుకుల్ విద్యాలయ స్థలంలో నవోదయ పాఠశాలను ఏర్పాటు చేయాలి. మేడ్చల్ జిల్లాకు మంజూరైన నవోదయ పాఠశాలను గురుకుల్‌లో ఏర్పాటు చేయాలి. దీని ద్వారా గురుకుల్ ఆక్రమణల నివారణకు అడ్డుకట్ట వేయొచ్చు. గురుకుల్ ట్రస్టును ప్రభుత్వం స్వాధీనం చేసుకొని కేజీ టు పీజీ ఉచిత విద్యనందించేందుకు చర్యలు చేపట్టాలి.

- ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బీజేపీ నేత, పూర్వ విద్యార్థి

క్రైం కార్నర్

గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్టు


గంజాయితో పట్టుబడిన యువకులు

తాండూరురూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తూ ఇద్దరు యువకులు పట్టుబడినట్లు కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంజాయి తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు గురువారం తాండూరు మండల పరిధిలోని గౌతాపూర్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇదే సమయంలో ఓ బైక్‌పై ఇద్దరు యువకులు రాగా, అనుమానంతో పోలీసులు బైకును ఆపి తనిఖీ చేశారు. బైకులో ఏముందని అడగటంతో ఇద్దరూ తడబడటంతో అనుమానం వచ్చి చూడగా, వారి వద్ద 160 గ్రాముల ఎండు గంజాయి లభించిందని తెలిపారు. ఈ ఇద్దరూ తాండూరుకు చెందిన వినోద్‌కుమార్, రాజీవ్ కాలనీకి చెందిన మహ్మద్ హర్షద్‌గా గుర్తించినట్లు తెలిపారు. వీరిని అదుపులోకి తీసుకుని గంజాయి, బైకును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ విఠల్ రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి ఇరువురిని కోర్టుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చర్లపల్లి-ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ల మధ్య చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్-చర్లపల్లి రైల్వేస్టేషన్ల మధ్య బుధవారం రాత్రి కేఎం నెంబర్ 208/2 వద్ద 17646 రేపల్లే నుంచి సికింద్రాబాద్ వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి (అందాజ 45) రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు గురువారం తెల్లవారుజామున ఘటనా స్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలించినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి పడి వ్యక్తి మృతి


కాశప్ప మృతదేహం

దౌల్తాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌పై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కొడంగల్ మండలం లోని కస్తూర్‌పల్లిలో జరిగింది. మండలంలోని కుప్పగిరిలో దర్గా దగ్గర కందూర్ నిమిత్తం గురువారం డప్పు కొట్టేందుకు కస్తూర్‌పల్లి గ్రామానికి చెందిన బుడగజంగం గోపాల్ అదే గ్రామానికి చెందిన మీదిగేరి కాశప్ప(50)తో పాటు బంధువులను పంచాయతీ ట్రాక్టర్‌లో కూర్చోబెట్టుకొని బయల్దేరాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో చంద్రకల్ శివారులో డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా బండరాయిపై ట్రాక్టర్‌ను ఎక్కించాడు. ట్రాక్టర్‌లో కూర్చున్న కాశప్ప కిందపడిపోయాడు. ఈ ఘటనలో తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య ఆశమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవిగౌడ్ తెలిపారు. మృతదేహాన్ని కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

బైక్ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

● పరిస్థితి విషమం

కీసర, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలైన ఘటన గురువారం కీసరలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒరిస్సాకు చెందిన మీనా(35) కొంత కాలం కిందట కీసరకు కుటుంబంతో వచ్చి కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. రోజూవారిగా మీనా గురువారం కీసర నుంచి కీసరదాయరకు కాలినడకన కూలిపనికి వెళ్తోంది. ఇంతలో అంకిరెడ్డిపల్లికి చెందిన బాలుడు బైక్‌పై వస్తూ మీనాను ఢీకొన్నాడు. దీంతో ఆమె తలకు తీవ్రగాయమైంది. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో ఈసీఐఎల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు 108సిబ్బంది తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

బంట్వారం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను తిరిగి అప్పగించామని గురువారం బంట్వారం ఎస్‌ఐ శ్రీశైలం యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మండల పరిధిలోని రొంపల్లి గ్రామానికి చెందిన చాకలి ప్రభు సెల్‌ఫోన్‌ను అందించామని తెలిపారు. సెల్‌ఫోన్‌ను నెల రోజుల క్రితం పోగుట్టుకున్నాడు. వెంటనే ఆయన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోలీసులు ఆఫోన్‌ను గుర్తించి రికవరీచేసి బాధితుడికి అప్పగించామని ఆయన తెలిపారు. ఇంకాఎవరైనా తమ సెల్‌ఫోన్ పోయినవారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

గ్రామ సమస్యలు పరిష్కరించాలి


పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

దోమ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాయిపల్లిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల నాయకులు సత్తయ్య ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి శ్రీవాణికి గురువారం వినతి పత్రం అందజేశారు. అదే విధంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను ప్రభుత్వం అర్హులైన వారందరికీ వర్తింప జేయాలన్నారు. ఎస్సీ కాలనీలో బోరు మంజూరు చేయాలన్నారు. సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, ప్రభుత్వ పాఠశాల ముందు తాగునీటి బోరు వేయించాలన్నారు. హనుమాన్, పోచమ్మ ఆలయాలకు వెళ్లే మార్గంలో సీసీ రోడ్డును వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శేఖర్, రమేశ్, వెంకటేశ్, రాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో ఆర్వో ప్లాంట్ ప్రారంభం


ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న డిపో మేనేజర్

కొడంగల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వేసవి ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తాండూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేశ్‌కుమార్, కొడంగల్ బస్టాండ్ కంట్రోలర్ పీఎస్.రెడ్డి తెలిపారు. స్థానిక బస్టాండ్‌లో వారు గురువారం ఆర్‌వో ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి కంట్రోలర్ రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభించారు.. వదిలేశారు!

- నిరుపయోగంగా వ్యవసాయ మార్కెట్
- దళారులకు ధాన్యం విక్రయాలు
- రైతులకు తప్పని తిప్పలు


నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ మార్కెట్


నిరుపయోగంగా వేయింగ్ షెడ్డు

కోట్‌పల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ ఉన్నా నిరుపయోగంగా మారింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 2022 ఏప్రిల్ 8న శంకుస్థాపన చేశారు. రైతుల సౌకర్యం కోసం 2023 ఏప్రిల్ 26వ తేదీన అప్పటి తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి చేతుల మీదుగా రూ.1.14కోట్ల నిధులతో కార్యాలయ భవనము, ప్రహరీ, వేయింగ్ షెడ్డుకు మండలంలో నూతనంగా వ్యవసాయ మార్కెట్‌ను ప్రారంభించారు. ఆనాటి నుంచి నేటి వరకు అది నిరుపయోగంగానే ఉండిపోయింది. అందులో బోరు, సీసీ రోడ్లు, వీధి దీపాలు వంటివి ఎలాంటి సౌకర్యాలు లేక మూతపడి ఉన్నది. కోట్లు వెచ్చించి మార్కెట్ నిర్మించినా రైతులకు ఉపయోగకరంగా లేకపోవడంతో రైతులు ధాన్యం విక్రయాలకు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని వికారాబాద్, తాండూర్, వంటి మార్కెట్లకు తీసుకెళ్తున్నారు. మార్కెట్ స్థానికంగా వినియోగంలో లేక రైతులు చిన్నచిన్న వ్యాపారుల వద్ద ధాన్యాన్ని విక్రయించి దళారుల చేతిలో మోసపోతున్నారు. దీంతో రైతులకు కాలంతో పాటు అదనంగా కిరాయిలు కావడంతో నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా మార్కెట్ ఉంటే ఇబ్బందులు తొలగిపోతాయని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం దృష్టిసారించి మార్కెట్‌ను కొనసాగించాలని కోరుతున్నారు.


ధాన్యాన్ని వికారాబాద్ తరలిస్తున్న రైతు (ఫైల్)

పండించిన ధాన్యం ఇక్కడే కొనాలి



పండించిన ధాన్యం మొత్తం కోట్‌పల్లి మార్కెట్‌లోనే కొనాలి. అందరికీ అందుబాటులో ఉంటుంది. ఇతర మార్కెట్‌కు వెళ్లాలంటే దూరం ఎక్కువ అవుతుంది. ఇక్కడే మార్కెట్ ఏర్పాటు చేయాలి. దూర భారం తగ్గుతుంది. రైతులకు మేలు జరుగుతుంది.

- చాకలి కిష్టయ్య, రైతు, ఎన్కెపల్లి

వినియోగంలోకి తీసుకొస్తాం



మార్కెట్ నిర్మించినప్పటి నుంచి నిరుపయోగంగానే ఉంది. ప్రస్తుతానికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాం. వచ్చే ఏడాది నుంచి కందులు, మొక్కజొన్నలు, వంటి ధాన్యం కొనుగోలు చేయడానికి షాపులు కూడా కట్టిస్తాం. ప్రధాన రోడ్డు నుంచి మార్కెట్‌వరకు సీసీరోడ్డు, మార్కెట్‌లో నీటిసౌకర్యం కోసం బోరు ఏర్పాటుకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో మార్కెట్ నిధుల నుంచి అంచనా విలువ రూ.కోటి ప్రతిపాదనలు పంపించాం.

- అంజయ్య, కోట్‌పల్లి, మార్కెట్ కమిటీ చైర్మన్

తైబజార్లకు వేలం


తైబజార్ పొందిన వ్యక్తికి పత్రాన్ని అందజేస్తున్న బషీరాబాద్ ఎంపీవో జయకర్

బషీరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ తైబజార్ వేలాన్ని గురువారం స్థానిక పంచాయతీ భవనంలో నిర్వహించారు. ఈ వేలం ఎంపీవో జయకర్ సమక్షంలో జరగగా స్థానికులు మాదోజీ, అబ్దుల్‌రజాక్ ఇద్దరు మాత్రమే పాల్గొన్నారు. అనంతరం బహిరంగ వేలం నిర్వహిస్తూ సర్కారి వారి పాటగా రూ.4,53,860తో ప్రారంభించగా అబ్దుల్‌రజాక్ రూ.4,57,500 పాటపడి తైబజార్‌ను దక్కించుకున్నారు. అనంతరం ఎంపీవో జయకర్ మాట్లాడుతూ గ్రామ సభలో నిర్వహించిన ప్రకారం వ్యాపారుల వద్ద 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంతలో రుసుము వసూలు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పవాన్ ఠాగూర్, సాయిల్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ నరేష్‌చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

తుంకిమెట్లలో..

బొంరాస్‌పేట్: మండలంలోని తుంకిమెట్ల రైతు వేదికలో గురువారం తైబజారు వేలం నిర్వహించారు. ఎంపీడీవో వెంకన్నగౌడ్, ఎంపీవో రవి ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో గ్రామానికి చెందిన చాకలి నర్సింహులు, బెస్త పోషప్ప వేలంలో పాల్గొన్నారు. చాకలి నర్సింహులు అత్యధికంగా రూ.2,75,000 వేలం పాడి దక్కించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాజేశ్ తెలిపారు. కారోబార్ తిరుపతయ్య ఉన్నారు.

చౌడాపూర్‌లో..

చౌడాపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తైబజారు, వాటర్ ప్లాంటుకు గురువారం వేలం నిర్వహించారు. వేలం పాటలో తైజారును వేలంలో ఎరుకలి నర్సింహులు రూ.3 లక్షల 38 వేలకు దక్కించుకున్నాడు. వాటర్ ప్లాంట్‌ను ఆంజనేయులు రూ.41 వేలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ ప్రభు, ఎంపీడీవో సోమలింగం, పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి పాల్గొన్నారు.

ముజాహిద్‌పూర్‌లో..

కులకచర్ల: మండలంలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో గురువారం తైబజారుకు వేలం నిర్వహించారు. వేలంలో అదే గ్రామానికి చెందిన కిష్టయ్య రూ.1.65లక్షలకు వేలాన్ని దక్కించుకున్నాడు. సంవత్సరం పాటు తైబజారు వసూలు చేసుకునే వీలుంటుంది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి సంతోష్, మాజీ ఉపసర్పంచ్ చంద్రభూపాల్, అనంతయ్య, పెంటయ్య, షర్ఫోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఎన్‌ఆర్ సేవలు అభినందనీయం


చెంగోల్‌లో ఎల్‌ఎన్‌ఆర్ కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి

తాండూరు రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామంలో ఎల్‌ఎన్‌ఆర్(లొంక నర్సింహులు యువసేనా) ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెంగోల్ గ్రామంలో గురువారం శంకర కంటి ఆస్పత్రి వారి సౌజన్యంతో, లొంక నర్సింహులు యువసేన వారు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 50 మందికి కంటి ఆపరేషన్ నిమిత్తం హైదరాబాద్ తరలించినట్లు యువసేనా అధ్యక్షుడు లొంక నర్సింహులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఎన్‌ఆర్ వ్యవస్థాపకులు లొంక నర్సింహులు, ఏఎంసీ డైరెక్టర్లు తులసీ రాథోడ్, కాంగ్రెస్ నాయకులు రాము యాదవ్, హర్షవర్ధన్‌రెడ్డి, హరీశ్వర్‌రెడ్డి, పులేందర్‌చారి, నారాయణరెడ్డి, నర్సిరెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

రాముడి సన్నిధిలో మాజీ సర్పంచ్ కన్నుమూత


లక్ష్మయ్య(ఫైల్)

పూడూరు, మార్చి 27, (ఆంధ్రజ్యోతి): రాముడి అపర భక్తుడు, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య మృతి చెందారు. ఆయన చివరి కోరిక తీర్చుకుని రాముడి సన్నిధిలోనే కన్నుమూశారు. వివరాలిలా ఉన్నాయి. పూడూరు గ్రామానికి చెందిన ఉద్దండరావు లక్ష్మయ్య(85) పూడూరు మాజీ సర్పంచ్‌గా పనిచేశారు. లక్ష్మయ్యకు రాముడంటే అమితమైన భక్తి. తన చివరి కోరిక మేరకు తోటివారు, కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం అయోధ్యకు వెళ్లారు. బుధవారం లక్ష్మయ్య అయోధ్య రామున్ని దర్శించుకున్నారు. రాముడి దర్శనం అనంతరం బయటికి వచ్చిన కొద్దిసేపటికే రాముడి సన్నిధిలోనే లక్ష్మయ్య మృతి చెందారు. కుటుంబ సభ్యులు లక్ష్మయ్య మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. లక్ష్మయ్య 2001లో టీడీపీ నుంచి పోటీ చేసి పూడూరు సర్పంచ్‌గా గెలుపొంది ఐదేళ్లపాటు సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి కృషి చేశారు.

కంటి వైద్య శిబిరం విజయవంతం


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు హరినాథ్‌నెహ్రూ

కొడంగల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆఫ్ కొడంగల్, కందూరి రామ్‌రెడ్డి లయన్స్‌కంటి ఆస్పత్రి మహబూబ్‌నగర్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కొడంగల్ ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించిన శిబిరంలో 150మందికి పరీక్షలు నిర్వహించి 34మందిని ఆపరేషన్‌ల నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని ఏనుగొండ రామ్‌రెడ్డి కంటి ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. వాసన్ ఐ కేర్ దిల్‌సుఖ్‌నగర్ సిబ్బంది, లయన్స్‌క్లబ్ దాసప్పయాదవ్, మురారివశిష్ట, మునీర్, వైద్యులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బీఎస్.ఆంజనేయులు

కులకచర్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం దోహదపడుతుందని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. మండలంలోని ముజాహిద్‌పూర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సంతోష్, చంద్రభూపాల్, షర్ఫోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 15 నుంచి బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన పూజలు


సమావేశంలో చర్చిస్తున్న నాయకులు

ఘట్‌కేసర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ పట్టణంలో బొడ్రాయి పునఃప్రతిష్ఠ చేయాలని స్థానికులు నిర్ణయించారు. గురువారం పార్టీల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు ఘట్‌కేసర్‌లోని మున్సిపల్ కార్యాలయం వద్ద సమావేశమై చర్చించారు. వచ్చే నెల 15, 16, 17, 18తేదీలలో బొడ్రాయి పునఃప్రతిష్ఠ చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం అందరు సమష్టిగా కృషి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో జంగయ్య, శ్రీనివాస్, అంజిరెడ్డి, సత్యనారాయణ, మల్లేష్, శ్రీనివాస్, అంజనేయులు, బాలయ్య, నారాయణ, బిక్షపతి, దాసు, శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు

బషీరాబాద్: ప్రభుత్వం మహిళా సంఘాలకు రూ.97లక్షల వడ్డీలేని రుణాలు మంజూరు చేసిందని బషీరాబాద్ సెర్ప్ ఏపీఎం పద్మారావు గురువారం తెలిపారు. మండల వ్యాప్తంగా 519సంఘాలకు గానూ 2024 ఏప్రిల్ నుంచి 2025 జనవరి వరకు బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాలు మంజూరు చేసినట్లు ఆయన వివరించారు.

కార్మికులు ఎండలతో జాగ్రత్తగా ఉండాలి

మేడ్చల్ టౌన్: వేసవిలో ఆర్టీసీ కార్మికులు ఎండలతో జాగ్రత్తగా ఉండాలని మేడ్చల్ డిపో మేనేజర్ సుధాకర్ అన్నారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు గురువారం జూట్ బ్యాగ్‌లను అందజేశారు. డిపో అసిస్టెంట్ మేనేజర్ రామారావు, కార్మికులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్ పాసుల పంపిణీ

ధారూరు: దివ్యాంగులకు బస్ పాసులను ధారూరు మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఎల్.అశోక్ ముదిరాజ్ గురువారం ధారూరులో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు తాము అండగా ఉంటామని, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను వారికి అందేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంజానాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బుజ్జయ్య గౌడ్, కె.కిరణ్‌కుమార్, మహ్మద్ బాబాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీ పరికరాలకు రైతులు దరఖాస్తు చేసుకోవాలి

బొంరాస్‌పేట్: 2024-2025 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం రైతులకు రాయితీపై అందిస్తున్న వ్యవసాయ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టా పాసు బుక్ కలిగిన ఎస్సీ, ఎస్టీ, జనరల్ మహిళలు మాత్రమే అర్హులు అని తెలిపారు. 50శాతం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను అందించడం జరుగుతుందన్నారు. ఈ నెల 29 వరకు మహిళా రైతులు పట్టాదారు పాస్ బుక్, ఆధార్ కార్డులతో వచ్చి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

చర్చి నిర్మాణానికి ఆర్థిక సాయం

కోట్‌పల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో చర్చి నిర్మాణానికి గురువారం బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కరీంపూర్ మాజీసర్పంచ్ సుందరి అనిల్ రూ.25వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చర్చి నిర్మాణ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ముస్లింలకు పండ్లు పంపిణీ

మేడ్చల్ టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పూడూరు, రాయిలాపూర్, గిర్మాపూర్, అత్వేల్లి, కిష్టాపూర్, మేడ్చల్ పట్టణంలోని మసీదుల్లో గురువారం ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు మేడ్చల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మణికంఠగౌడ్ పండ్లను పంపిణీ చేశారు. అదేవిధంగా 1000 మంది నిరుపేద కుటుంబాలకు పండుగ జరుపు కోవటానికి అవసర పడే వంట సామగ్రిని కానుకగా అందజేశారు. ఆయన వెంట నాయకులు సయ్యద్ లాయక్ అలీ, ఎండీ రఫీక్ , ఎండీ అష్రఫ్, సయ్యద్ ఇనాయత్ అలీ, ఎండీ.ఆరీఫ్ ఉన్నారు.


ముస్లింలకు రంజాన్ తోఫా అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ మణికంఠగౌడ్